# పుట్టి

మా వెంకట్రావుగారు గొప్ప సాహిత్య ప్రియుడు.

ఎక్సయిజు డిపార్టుమెంటులోనో మరెందులోనో కల్పవృక్షంలాంటి ఉద్యోగం చేస్తున్నాడు. ఎప్పుడూ తెల్లని మడత నలగని దుస్తుల్లో మల్లెపువ్వులా శుభ్రంగా వుంటాడు. అతనికి జీవితం ఎంతో సంతృప్తికరంగా ఉంది. ఆ మాట దాచుకోడు నిర్మొహమాటంగా పైకి చెప్పేస్తాడు.

"హాయిగా తిన్నాను. ఇంట్లో ఏదీ లేదని అనుకునే పనిలేదు. అన్నీ వున్నాయి ఉప్పు దగ్గర్నుంచి రోజూ యాపిల్ పళ్ళ దాకా దేనికీ లోటు లేదు. ఖరీదైన చీపురుకట్ట దగ్గర్నుంచి ఫ్రిజ్ దాకా అన్నీ వున్నాయి. మొన్న మొన్ననే రేడియో గ్రాం కావాలని మా ఆవిడ పోరుపెడితే పడలేక వెంటనే కొనేశాను, గ్రామఫోనూ దానితోపాటు వందలకొద్దీ కొత్తా పాతా రికార్డులూ, పెద్దసైజు రేడియో ఇంకా రెండు ట్రాన్సిస్టర్లూ ఉండగా ఇంకా రేడియోగ్రాం ఎందుకు? అంటే

మా ఆవిడా పిల్లలూ కూడా వినకుండా ఒక చిన్నసైజు విప్లవం లేవదీశారు. ఆ పోరుపడలేక కొనేశాను. అయినా మీరు మాటిమాటికీ దేశంలో పేదరికం, ఆకలీ అంటారు. ఎక్కడున్నాయవి? అందరూ తింటూనే వున్నారు. ఉన్నంతలో సినిమాలు చూస్తున్నారు. ఆఖరుకు చెట్టుక్రింద వండుకు తినేవాళ్ళు కూడా సంతృప్తిగానే బతుకుతున్నారు. చూడబోతే మీ దృష్టిలోనే ఏదో లోపం ఉన్నట్టుంది. ఎప్పుడూ ఆకలితో చచ్చిపోయేవాళ్ళూ రోగిష్టివాళ్ళూ, అడుక్కుతినే వాళ్ళూ మాత్రమే కనబడతారెందుకు మీకు? అంటూ వుంటాడు.

ఆయనకు సాహిత్యమంటే యిష్టమని చెప్పాను. కదా? సాయంకాలం ఆఫీసునుంచి వచ్చీరాగానే అందమైన అట్టలున్న పుస్తకాలు ముందువేసుకుని కూర్చుంటాడు. వాళ్ళ గ్రంథాలయంలోకి అప్పుడప్పుడు తానే పుస్తకాలు 'సెలక్టు' చేస్తూవుంటాడు. ఇంట్లో అందరూ చదువుతూ కూర్చుంటారు. పిల్లలు పిల్లల బొమ్మల పత్రికలు పుచ్చుకుని కూర్చుంటారు. ఆయన భార్య త్రివర్ణ ముఖచిత్రమున్న 'బెస్ట్ సెల్లర్' నవల పేజీలు తిప్పుతూ కూర్చుంటుంది. వెంకట్రావుగారు కూడా అటువంటిదే మరో పుస్తకంలో లీనమైపోతాడు. ఇది నాకు వెంకట్రావుగారి కుటుంబం గురించి గొప్పగా నచ్చిన విషయం.

ఆయనకు నేనంటే అభిమానం. మా ఆవిడకూ వాళ్ళ ఆవిడకూ మధ్యకూడా మంచి దోస్తీ వుంది. కాకపోతే మా ఆవిడ అప్పుడప్పుడు వొంటరిగా ఉన్న సమయాల్లో “ఏమండీ! ఆ భ్రమరాంబ గారు ఇవ్వాళ బజారుకుపోయి నెక్లెస్ కొనుక్కొని వచ్చిందండీ. ఎంత బాగుందనుకున్నారు. కళ్ళు జిగేల్మన్నాయి” అని మాత్రం అంటుంది. మరొకప్పుడు మరో రెండువందల రూపాయల ఖరీదుగల చీరగురించో, లేకపోతే వాళ్ళ ప్రెషర్ కుక్కర్లూ గ్యాస్‌స్టవ్ గురించో, దేన్నిగురించో ఒక దాన్ని గురించి ఊరికే చెబుతూవుంటుంది. అవి తనకుకూడా కావాలని అనదు కాని ఆకళ్ళలో మెరుపు, ఉత్సాహం ఇవి మాత్రం స్పష్టంగా ఆ విషయం నాకు అర్థమయ్యేట్లు చేసాయి. నేను విని ఊరుకుంటాను నాకు తెలుసు. ఒకనాడు వాళ్ళయింటికి గ్యాస్‌స్టవ్ కుపయోగించే సిలిండర్ వచ్చింది. మా యిద్దరి పేర్లూ ఒకటే కావడంతో వాడు మా యింట ముందు ఆగాడు. ‘వెంకట్రావుగారు మీరేగా ?’ అంటూ లోపలికి వచ్చాడు. మాఆవిడ కూడా ముందుగది లోకి వొచ్చింది. నేను కిటికీలోనుంచి ఆ సైకిలూ, దాని వెనక ఉన్న సిలిండరూ చూసి ‘పక్కయిల్లు’ అని చెప్పాను. వాడు వెళ్ళిపోయాడు. మా ఆవిడ నావంక చూసింది. లోపల పొయ్యి సరిగ్గా మండటంలేదు కాబోలు కళ్ళు రెండూ ఎర్రగా జ్యోతుల్లాగున్నాయి. ఆ చూపులో నా ఒక గొప్ప డైలాగే వినిపించింది. “పొయ్యిమండక ఛస్తు

న్నాను. పదేళ్ళనుంచి ఇలా ఛస్తున్నాను. ఈ కల్లెప్పుడో ఇలాగే పోతాయి. గుడ్డిదాన్నయిపోతాను. ఈ వంటపని నన్ను తినేస్తున్నది. ఇలాగే వంటయింటిని అంటిపెట్టుకుని ఇరవైనాలుగ్గంటలూ బాధపడమని దేవుడు నా నుదుట ఘట్టిగా రాసి పెట్టాడు. అయినా ఎవర్నో అని ఏం లాభం? పెట్టిపుట్టివుండాలి దేనికైనా 'పుణ్యంకొద్దీ పురుషుడూ దానంకొద్దీ బిడ్డలూ' అన్నారు'' ఇన్ని మాటలు నాకా చూంపుతో వినిపించాయి. తర్వాత అనవసరంగా కాళ్ళకడ్డం వస్తున్నారనే మిషతో పసివాళ్ళిద్దర్నీ నాలుగుబాది లోపలికి వెళ్ళిపోయింది. నేను నిట్టూర్చి వూరుకున్నాను.

వెంకట్రావుగారు ఒకనాడు హఠాత్తుగా మాయింటికి వచ్చాడు. చేతిలో ఒకపుస్తకంతో వచ్చాడు. చెప్పానుగా నామీద ఆయనకు అభిమానమని? ఆ అభిమానం నేను కూడా చిన్నదే అయినా గౌరవనీయమైన ఉద్యోగంలో ఉన్నానని కావచ్చు. ఉప్పుకూ పప్పుకూ లేకపోతే నెలాఖరులో 'పాతిక రూపాయల అప్పుకూ' ఆయన దగ్గరికి వెళ్ళడం లేదని కావచ్చు. లేకపోతే చచ్చోచ్చువుచ్చో ఒక రచయితనని అయినా కావచ్చు.

వచ్చిరావడమే సుడిగాలిలాగా సంరంభంగా వచ్చాడు. చేతిలో వున్న పుస్తకం నాముఖం ముందు ఆడిస్తూ "ఇదండీ నవల అంటే ఇప్పుడే చదవడం పూర్తి చేశాను.

ఏమికథ, ఏమి పాత్రలు అద్భుతం." అంటూ పొగిడాడు. ఆయనకు తెలుసు నా ముందు మరొక రచయితను ఎంత పొగిడినా నేనేమీ ఇరిటేట్ కానని. నేను నవ్వి "అంత బాగుందా?" అని అడిగాను.

"బాగుందా ఏమిటి? మీరూ చదివితీరాలి. నేను చదివాను మా ఆవిడ చదివింది. మా పెద్దమ్మాయి కూడా చదివింది. అందరిదీ ఒకటే మాట... 'అద్భుతం' అంతే... మరో మాట లేదు."

"సరే... నేనూ చదువుతాన్లెండి." అన్నాను.

ఆయన "చదవగానే సరికాదు; మీకు బాధ కలిగినా సరే ఆప్తులనుకుని ఒక్కమాట చెబుతాను. ఏమీ అనుకో వద్దు. ఇది చదవడమే కాదు చదివి నేర్చుకోవలసింది కూడా వుంది." అన్నాడు.

ఏమీ అనుకోవద్దనీ, బాధపడవద్దనీ ముందే చెప్పాడు కాబట్టి నేనేమీ అనుకోలేదు. నవ్వి ఊరుకున్నాను.

ఆ పుస్తకం నా ముందుంచి వెళ్ళిపోతూ, 'మీరూ అలా రాయండి. అది నా కోరిక. ఎప్పుడూ ఆకలీ చావులూ, డబ్బు బాధలూ, రోగాలూ, వాటిని గురించి రాయకండి. అవి అస్సలు లేవనుకోండి. ఈ గుడ్డివాళ్ళను గురించీ, కుంటి వాళ్ళను గురించీ డబ్బు లేనివాళ్ళను గురించీ, పేదలగురించీ

రాస్తే వాళ్లు చదువుతున్నారా? అందువల్ల మీరు ఏం సాధిస్తున్నట్టు? పుణ్యమా పురుషార్థమా? మీరెవరిని గురించి రాస్తున్నారో వాళ్లు చదవరు, చదివే వాళ్ళకా ఈ ఆకలీ వగైరా నాన్సెన్స్ నచ్చదు. అందువల్ల నా మాట విని ఒక మంచి కథ రాయండి. నవల సంగతి తర్వాత చూసుకోవచ్చు. ఇదొక ఛాలెంజీగా తీసుకోండి. మళ్ళీ సాయంకాలం వొస్తాను ఇవాళా రేపూ సెలవుకదా! గట్టిగా కూర్చోండి'' అంటూ వెళ్ళిపోయాడు.

నాకు మతి చెడినంత పని అయింది. పెద్దమనిషి, ఛాలెంజీ పారేసి వెళ్ళిపోయాడు. ముందున్న కాయితాలు గాలికి రెపరెపలాడుతున్నాయి. లోపలి నుంచి పిల్లల ఏడుపూ మా ఆవిడ గదమాయింపులూ వినబడుతున్నాయి. ఆ పుస్తకం చేతిలోకి తీసుకున్నాను చదవడం పూర్తయే వరకూ లేవలేదు. ఈలోపల మా ఆవిడ రెండు మూడు సార్లు పిలిచినట్లున్నది 'పిల్లలుకూడా అన్నాలు తిన్నారు లేవండిబాబూ పన్నెండు గంటలయింది...' అన్నమాటలు కూడా వినిపించినట్లే ఉన్నాయి కాని చివరి పేజీకూడా పూర్తి చేసి కాని నేను లేవలేదు.

"అయిందా? ఇప్పుడన్నా లేవండి. నాలుగు మెతుకులు తిని కాస్త నడుం వాల్చాలి. మళ్ళీ చాకిరీ ఉందిగా." అన్నది మాఆవిడ. వెళ్ళి భోజనంముందు కూర్చున్నాను.

నిజమే ఆయన చెప్పినమాట. పుస్తకం చదువుతూ వుంటే మరో అద్భుత ప్రపంచంలో విహరించినట్టుంది. ఆప్రపంచం ఎంతో అందంగా వుంది. అక్కడ ఆర్థిక అసమానతలూ, ఆకలీ, పేదరికమూ, ఏవీ లేవు. ఒక మంచి బ్రహ్మాండమైన ఎ. సి. హోటల్లో షడ్రసోపేతమైన భోజనం చేసినట్టున్నది. ఆ హోటల్ ముందు దీనులూ నిర్భాగ్యులూ అడుక్కుంటూ ఉంటారు. నిజమే కాని మనం వాళ్ళనెందుకు చూడాలి? వీలయితే ఆ హోటల్ వారితో చెప్పి వాళ్ళందరినీ బెత్తాలతో కొట్టించి దూరంగా తరిమివేయాలి. మళ్ళీ వాళ్లందరూ అక్కడే మూగవచ్చు. కాని మనం ఈలోపల వెళ్ళి మిల మిల మెరిసే కారులో కూర్చుంటాం కదా! ఆ కారు నున్నటి రోడ్డు మీద జరజర జారిపోతుంది.

లోపలికి వచ్చి అంతకుముందు వ్రాయడం మొదలు పెట్టిన కథ మళ్ళీ చదివాను. తర్వాత వ్రాయడం కొనసాగించాను.

*         *         *

ఈ రైలు కోసం ఎదురుచూస్తూ ప్లాట్ ఫారం మీద గంటకు పైగా గడిపాడు రవీంద్ర. మాటిమాటికీ కర్ణపుటాలను బద్దలుచేస్తూ ఆవిరి విడుస్తూ నడుస్తున్న ఇంజన్లూ, వుండివుండి వొస్తూ పోతున్న రైళ్లూ వాటి నిండా క్రిక్కిరిసి వున్న జనమూ, వారి సందడీ... ప్లాట్ ఫారం మీద కంగా

రుగా పరుగులు పెట్టే జనమూ, వారి కేకలూ మధ్యమధ్య బరువులు మోసుకుపోతున్న ట్రాలీలు, అవితోసే వారి హెచ్చరికలూ, ఇవన్నీ సహిస్తూ అతి కష్టంమీద గంటసేపు గడిపాడు.

ఎట్టకేలకు ఆ రైలు వస్తున్నది. దూరంగా దయ్యం కన్నులాంటి లైటు ముందు కనిపించింది. జనం అప్పటికే ఆదుర్దాగా లేచి తమతమ సామాన్లు పట్టుకుని నిలబడ్డారు. కొందరి ముఖాలలో 'ఆ రైల్లో కూర్చునేందుకు కాకపోయినా కనీసం నిలబడేందుకయినా చోటుంటుందా' అనే ఆత్రుత కనిపిస్తుంటే, మరికొందరు రిజర్వేషన్లున్నవారు, పైతరగతి వారూ నిశ్చింతంగా ఉన్నారు. మొత్తంమీద జనం ఆడవాళ్ళూ మగవాళ్ళూ, పిల్లలూ, పాపలూ,...అంతా గొప్ప హడావిడిగా ఉంది. కోలాహలం గానూ ఉంది.

రైలువచ్చి ఆగింది. జనంలో ఆదుర్దా కూడా ఎక్కువయింది. మూడవతరగతి రైలు పెట్టెలముందు తోక్కిసలాటలు కుమ్ములాటలు మొదలయ్యాయి. ప్రతి పెట్టెదగ్గరా ఆగి చూస్తూ నడుస్తున్నాడు రవీంద్ర. అంతలో "బావా! ఇదుగో ఇటు..." అని వినిపించింది. ఫస్టుక్లాసు కంపార్టుమెంట్ గుమ్మంలో నిలబడివుంది వాణి. లేత ఆకుపచ్చని చీరె కట్టుకుని వుంది. నల్లని జాకెట్ వేసుకుని వుంది. చెవులకు రింగులు పెట్టుకుని వుంది. ఎడమచేతికి ఖరీదైన బుల్లి

వాచీ, కుడిచేతికి అవేవో తమషా అయిన గాజులూ, ధరించి వుంది. మొత్తంమీద అద్భుతంగా అందంగా ఫస్టుక్లాసుగా వుంది. పైగా చిరునవ్వులు చిలికిస్తున్నది.

ఆమె రవీంద్రను చూసి నవ్వుతూ "బావా! వొచ్చేశావే? నువ్వు స్టేషనుకు రావనుకున్నాను" అన్నది.

అతడు నుదుటిమీద పడుతున్న జుట్టు పైకితోసుకుంటూ "రాకుండా ఎలావుంటాను? ఇంత మహాఘనత వహించిన మరదలు ఇన్నాళ్ళకుగాను వొస్తూవుంటే ఆష్టరాల్ స్టేషనుకు రాకుండా వుండగలనా?" అన్నాడు.

ఆమె మళ్ళీనవ్వింది. "ఏమో నావైరు చేరిందో లేదో, చేరినా చూశావో లేదో, చూసినా గుర్తుపెట్టుకున్నావో లేదో, గుర్తుపెట్టుకుందా మనుకున్నా గుర్తున్నదో లేదో," అంటూ ప్రారంభించింది.

అతడుకూడా నవ్వి "మొదలు పెట్టావూ." అని వూరుకున్నాడు.

"అవునుమరి. మతిమరుపులో, పరధ్యానంలో తమరితో పోల్చగలిగిన వారెవరూ లేరుకదా?"

"సరే ... అంతా తర్వాత ... ఇంటికి వెళ్ళి తీరిగ్గా ఆటలు పట్టిద్దువుగాని...ముందు దిగిరా..."

"కూలీ రావొద్దా?"

"కూలీ దేనికి? అంతబరువు లేమున్నాయి?"

"సూట్ కేసు ఉందిగామరి..."

"అది అంత బరువుగా వుందా? నువ్వు గాని అందులో కూర్చోడం లేదుకదా? నువ్వు కూర్చోని పక్షంలో నేను పట్టుకు రాగలను దాన్ని..."

"అబ్బో! బావగారికి మాటలు జోరుగానే వొస్తున్నాయే...కొంచెం తగ్గండిమరి...తమరు అవలీలగా దాన్ని నెత్తిన పెట్టుకుని నడవగలరు. నాకు తెలుసు. అయినా ఎవరయినా చూస్తే ఎంత అసహ్యంగా ఉంటుంది?"

రవీంద్ర మరి మాట్లా లేదు. అంతలో ఒక కూలీవాడు వొచ్చాడు. సూట్ కేసు తీసుకుని నెత్తిన పెట్టుకుని నడవడం ప్రారంభించాడు. వాడు జనంలో కలిసిపోతుంటే ఎక్కడ తప్పిపోతాడో అని వేగంగా అడుగులు వేశాడు రవీంద్ర, వాణి నవ్వి "నెమ్మదిగా పదండి బావగారూ! వాడెక్కడికీ పారిపోడు..." అన్నది.

ఇద్దరూ బయటికి వచ్చారు. టిక్కెట్లు ఇచ్చి మెట్లు దిగుతూ వుండగానే రిక్షాలవాళ్లు గుమిగూడి గొడవచేయడం ప్రారంభించారు. వాళ్ళిద్దరూ ఆగుంపును తప్పించుకుని ఇవతలికి వచ్చి 'అమ్మయ్య' అనుకున్నారు.

రవీంద్ర 'రిక్షా మాట్లాడటమా లేకపోతే జట్కా బండి బేరం చేయడమా' అని మీమాంసలో పడితే వాణి చొరవ తీసుకుని 'ఇలారండి బావగారూ!' అంటూ ఒక ఆటోరిక్షా ఎక్కికూర్చుంది. కూలి వాడు సూట్‌కేసు అందులో ఉంచి ఆమె యిచ్చిన రూపాయో అర్ధరూపాయో మారు మాట్లాడకుండా పట్టుకు పోయాడు.

రవీంద్ర కూడా ఆటోలో ఎక్కి యింటి అడ్రసు చెప్పాడు. ఆటో మరుక్షణంలో రివ్వున దూసుకుని ముందుకు పోయింది. రోడ్డు ప్రక్కనుంచి భయంకరమైన దుర్గంధం... వాణి ముక్కు మూసుకుని 'ఘోరం' అన్నది. 'అవును ఘోరంగానే వుంది. మునిసిపాలిటీ సిబ్బంది నెలరోజులనుంచీ సమ్మె చేస్తున్నది. వారికి ఆరునెలలుగా జీతాలు లేవట' అన్నాడు రవీంద్ర.

*   *   *

ఇంతవరకూ వ్రాసి వ్రేళ్ళు విరుచుకున్నాను. మా ఆవిడ ఎందుకో రుసరుస లాడుతూ కాఫీ తెచ్చి అందించింది. 'ఎందుకలా రుసరుసలాడుతున్నావని నేను అడగనూలేదు ఆమె చెప్పనూలేదు. కాఫీ చేదుగావుంది. పాలు సరిపోలేదో, లేకపోతే పంచదార తక్కువయిందో అర్థంకాలేదు. గ్లాసు తీసుకు పోయేందుకు వచ్చిన మాఆవిడను పొరపాటున అడిగే శాను. 'కాఫీ చేదుగా వుందేమని.'

"ఆఁ! ఉండదూమరి? పంచదార అయిపోవచ్చిందని మీకు చెప్పి రెండు రోజులయింది. అక్కడికీ ఎంతో పొదుపుగా వాడాను, ఇక్కడితో డబ్బా ఖాళీ అయింది. మీ యిష్టం. రేపటికి ఈ మాత్రంగా కూడా కాఫీ ఉండదని గుర్తుంచుకోండి ... అయినా, మీకు ఇవన్నీ పట్టాయా ? ఆఫీసు ఫైళ్ళూ... కాస్త తీరిక దొరికితే ఆ రాతలూ ... ఆ వెంకట్రావుగారు చెప్పినట్టు ఆకలీ, బీదతనమూ, ముష్టి వాళ్ళూ... వీటిని గురించి రాస్తే ఏం వొరుగుతుంది? కాయితాల కట్టలు పెరిగి పోతున్నాయి. పైసా ఆదాయంలేదు. క్షణం తీరికా లేదు. ఎందుకొచ్చిన ఆయాసం." అంటూ కలగాపులగంగా ఏవో మాట్లాడేసి గ్లాసు అందుకుని లోపలికి వెళ్ళిపోయింది. వెళ్ళికూడా లోపలినుంచీ యింకా ఏమిటో నసుగుతూనే వుంది.

నేను నిట్టుర్చాను. కొత్తరకం కథ. వెంకట్రావుగారినీ, మా ఆవిడనూ ఇంకా వేలాది పాఠకులనూ అలరించే కథ రాస్తున్నాను. ఎటువంటి కథలు వేలాది, లక్షలాది పాఠకులను అలరిస్తాయో పత్రికలవారికి బాగా తెలుసు. అందువల్లనే నా కథలేవీ అచ్చుకాలేదు. ఈ కథ మాత్రం అలా కాదు. తప్పనిసరిగా అచ్చయి తీరుతుంది. వెంకట్రావుగారి వంటి పాఠకులు ఎందరో ఉత్తరాలు రాస్తారు. అందువల్ల నిశ్చయంగా వెంకట్రావు గారినే కొలతబద్దగా తీసుకోవాలి.

ఆయన ఇంతవరకూ విని ఏమంటాడో కనుక్కో—వాలి ఆయన అభిరుచి ప్రకారం దీన్ని 'డెవలప్' చెయ్యాలి.

నేను పెన్ను మూసి లేచాను. ముందు ఇంట్లో పంచదార గురించి ఆలోచించాలి. ఇంకా నయం ... బియ్యం, ప్రధాన ద్రవ్యం, నిండుకోలేదు. నెలాఖరు రోజులు ... మూడు రూపాయలు పుట్టించాలి ... ఈ డబ్బనేది ఇంత అరుదయి, బ్రహ్మపదార్థం లాగా కంటికి కనిపించకుండా పోయిందెందుచేత ?

ఇంతలో ఎవరో వాకిట్లో నుంచి పిలిచారు. 'వచ్చె వచ్చె' అంటూ వరండాలోకి వచ్చాను. మా యింటి కుడివైపు పెంకుటింట్లో వుండే గుమస్తా. ఏదో డిపార్టుమెంటులో యల్డీసీ. తల్లీ తండ్రీ ముదివగ్గులై ఇంకా బతికేవున్నారు. ఆ తండ్రి మాటిమాటికీ "ఎప్పటికి భగవంతుడి పిలుపొస్తుందా అని ఎదురు చూస్తున్నాను. అయినా ఇంతకాలం బ్రతకకూడదండీ... ఇతరులకు బరువుగా..." అంటూ వుంటాడు. తల్లి ఏమీ అనదు.

అతన్ని నవ్వుతూ పలకరించాను. అతడు సిగ్గుపడుతూ "ఏమీ లేదు" అంటూనే ప్రారంభించాడు అతనికి రెండో మూడో రూపాయలు కావాలిట. మళ్ళీ, ఎల్లుండేకదా ఫస్టు తారీకు, ఆనాడిచ్చేస్తాడట. నేను 'లే'దనే లోపుగానే నన్ను

మాట్లాడ నివ్వకుండా తన చెల్లెలు మొన్ననే వచ్చిందనీ, ఆసాయంకాలమే వెళ్ళిపోతున్నదనీ, చీర కాకపోయినా రవిక గుడ్డ అయినా పెట్టి పంపకపోతే చాలా అన్యాయంగా ఘోరంగా వుంటుందనీ ఆ మాటలు తన భార్య అన్నదనీ గబగబ చెప్పుకుపోయాడు.

నేను నోటమాట లేకుండా విన్నాను. తర్వాత ఆవు లించి వ్రేళ్ళు విరుచుకుని "సరే కాస్సేపాగి, ఒక అరగంట ఆగి రండి. అలాగే యిస్తాను" అన్నాను. అతడు 'అలాగే' అని వెళ్ళిపోయాడు.

అయిందా? ఇప్పుడు వేటకు బయలుదేరాలి. నాకు మూడూ, ఆయనకు రెండూ అయిదు రూపాయలు కావాలి. నాకనిపించింది. ఒకవేళ రూపాయల చెట్టనేది ఒకటి వుండి దాన్ని పట్టుకొచ్చి మన పెరట్లో వేశామనుకోండి మన పెరట్లో అది ఎదగదు. అసలు బతకదు. దానికి వేరే నేల, వేరే శీతోష్ణ స్థితులూ కావాలి.

'సరే' అనుకుని పైన కండువా వేసుకుని 'రామనాథం యింటిదాకా వెళ్ళొస్తా' నని మా ఆవిడకు చెప్పి బయల్దేరాను. రామనాథం నాపుణ్యం కొద్దీ ఇంట్లోనే వున్నాడు. ఇంకా కట్ జోకర్ టైము అయినట్టు లేదు. అతడు అప్పుడప్పుడు అవసరమైతే అయిదూ పదీ యిస్తూ వుంటాడు నాకు. యిప్పుడూ అడగ్గానే యిచ్చాడు. అది తీసుకుని

దోవలో కిలో పంచదార ఘోరమైన బ్లాక్ మార్కెట్ ధరకుకొని యింటికి వచ్చాను. అంతలో అతడు మళ్ళీ వచ్చి పిలిస్తే వెళ్ళి రెండు రూపాయలూ ఇచ్చేశాను. అతడు వెంటనే వెళ్ళిపోయాడు. పంచదార మా ఆవిడకు అప్పగించి అలా ఒక్క క్షణం కూర్చున్నానో లేదో వెంకట్రావుగారు వచ్చేశాడు. వచ్చీ రావడమే నా ఎదురుగా కూర్చుని "ఏదీ మొదలుపెట్టరూ కథ" అన్నాడు.

నేను ఆ కాస్తా చదివి వినిపించాను. చాలా ఏకాగ్ర చిత్తంతో విన్నాడు. విని అటూ యిటూ కాస్సేపూ పైకి కాస్సేపూ చూశాడు. తర్వాత "బాగుంది..." అన్నాడు మళ్ళీ ఎందుకో 'ఫరవాలేదు' అన్నాడు. నేను జాగ్రత్తగా వింటున్నాను. ఆయన చెప్పడం మొదలుపెట్టాడు: "బాగుంది... మొదలు పెట్టడం బాగానే మొదలు పెట్టారు. ఒక ఆబ్సెంట్ మైండెడ్ బావగారూ, చలాకీ అయిన మరదలూ, బాగుంది. బావగారు కూడా బాగా డబ్బున్నవాడూ, కారున్నవాడూ అయితే యింకా బాగుండేది. కాని ఫరవాలేదు. అతడు పేదవాడు కావడం కూడా మంచిదే... ప్రేమకూ, పెళ్ళికీ ఈ అంతస్తులు అడ్డురావని నిరూపించవచ్చు. ఇకపోతే ఆ స్టేషనులో గందరగోళం, రిక్షావాళ్ళ గొడవ, ఆ మునిసిపాలిటీ వాళ్ళ సమ్మె సంగతీ తీసెయ్యండి. దోవకటూయిటూ అవేవో చెట్లున్నాయి? ఆఁ! అశోక వృక్షాలు పెట్టండి. ఇక తర్వాత వీళ్ళిద్దర్నీ యింటికి

తీసుకుపోండి అక్కడ మరో మగ పాత్రనో ఆడపాత్రనో సృష్టించండి ... ఒక డబ్బున్న అబ్బాయి లేకపోతే పేద యింటి అమ్మాయి...ఆపైన మీ యిష్టం ... కావలసినంత సబ్జక్టు...ఆ అమ్మాయి యిద్దరు అబ్బాయిల్లో ఎవరిని పెళ్ళి చేసుకుంటుందో, లేకపోతే ఆ అబ్బాయి యిద్దరు అమ్మాయిల్లో ఎవర్ని పెళ్ళి చేసుకుంటాడో తేల్చకుండా చివరకంటా కథను లాగించండి...అసలు నవలే వ్రాయవచ్చునండీబాబూ!" అన్నాడు. తర్వాత మళ్ళీ 'గుడ్ లక్' అంటూ వెళ్ళిపోయాడు.

మళ్ళీ కథ వ్రాద్దామని కూర్చున్నాను. యిప్పుడు కళ్ళ ముందు యిందాక రెండు రూపాయలు అప్పుగా పుచ్చుకు వెళ్ళిన పొరుగింటి ఆయనే కనిపిస్తున్నాడు. ఆ మాత్రం డబ్బులేక ఆయన పడిన ఆరాటమే గుర్తుకు వచ్చింది. 'ఆ రెండు రూపాయలూ దొరక్కపోతే, పుట్టింటికి వచ్చిన చెల్లెలికి చివరకు రవిక ముక్కయినా పెట్టకుండా పంపించవలసివస్తే అదెంత 'దారుణం' అని అతడూ అతని భార్యా పడిన ఆ వేదనా, ఆ రాటం...ఇదంతా మనసులో మెదిలింది. మనసంతా ఏదోలా అయిపోయి బరువెక్కింది.

కలంచేతిలోకి తీసుకున్నాను. మళ్ళీ వ్రాయడం ప్రారంభించాను.

* * *

ఇంటిముందు ఆటోరిక్షాలో నుంచి దిగుతూ వుండ

గానే వరండాలో నిలబడివున్న రవీంద్ర భార్య అరుంధతి సంరంభంగా ఎదురువచ్చింది, 'ఏదీ మా వాణి వొచ్చేసిందా?' అంటూ.

"ఆఁ! వొచ్చేసింది ... మీ బంగారు చెల్లెలు..." అన్నాడు రవీంద్ర. ఆటోవాడికి రెండు రూపాయలు ఇచ్చి పంపిస్తూ. నెలాఖరు రోజులు ... రెండు కరకు రూపాయలు ఈ ఆటోరిక్షాకు ధారపోశాడు "మళ్ళీ ఈనెల కూడా అప్పు చేయక గడిచేట్టు లేదురా దేవుడా" అనుకుంటూ లోపలికి వచ్చాడు.

అరుంధతి మొహం వెలిగిపోయింది. ఫస్టు తారీఖున రవీంద్ర జీతం అందుకుని కొంచెం బరువైన జేబుతో ఆఫీసు నుంచి ఇంటికి వచ్చినప్పుడు అతన్ని చూసిన ఆమె మొహం ఎలావుంటుంది? అలాగే వెలిగిపోయింది ఆమె మొహం. అక్కచెల్లెళ్ళిద్దరూ ఒకరి నొకరు కౌగలించుకున్నంత పని చేశారు. "రావే లోపలికి...ఎన్నాళ్ళయిందో నిన్ను చూసి...అయినా మరిదిగారు అంత చిత్రమైన మనిషేమిటే? ఏడాదికొక సారయినా ఇటువైపు రారేం మీరు? ఎంత డబ్బున్న వాళ్ళయినా మేమెంత మామూలు మనుషులమైనా ఇంతయిందిపనికిరాదే మాతల్లీ!" అన్నది అరుంధతి చెల్లెల్ని కళ్ళారా చూస్తూ.

వాణి "అదేమీ లేదక్కా...వారికి అస్సలు సెలవు

దొరకదు...వాడు వుద్యోగం తీరికేవుండదు..." అంటూ కూర్చుంది.

"అవున్లే మరి ... నెలకు పదిహేను వందల రూపాయలు ఊరికే వస్తాయా? మీ బావగారు చూడు ఆఫీసు వేళ తప్పించితే ఊరికే గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోడమే నాముందు. అన్నీ మరిదానికి తగ్గట్లుగా?"

"పాపం! బావనలా అనకే. మంచివాడు..." అని నవ్వింది చెల్లెలు.

రవీంద్ర ఉలిక్కిపడ్డాడు. అనవసరంగా తన ప్రసక్తి యిప్పుడు తేవడం ఎందుకో అతనికి అర్థం కాలేదు. మతిపోయిన వాడిలా ఆ అక్కాచెల్లెళ్ళను చూస్తూ అలాగే కూర్చున్నాడు.

మళ్ళీ "ఎన్నాళ్ళయిందే నిన్ను చూసి" అన్నది అక్కగారు.

"అవునే...సుబ్బులు పెళ్ళిలో కలుసుకోడమే..." అన్నది చెలెలు. మళ్ళీ ఒక్కక్షణం ఆగి "ఏం పెళ్ళిబాబూ! ఉక్కిరిబిక్కిరై చచ్చాం ... మావారయితే విసుకున్నారు కూడా" అన్నది.

"సుబ్బులు కిప్పుడు అయిదోనెల...నీకు తెలుసుటే?" అని అడిగింది. అక్కగారు.

చెల్లెలు బుగ్గన వ్రేలువేసుకుని "అరె, నాకు తెలియదే ... అయినా అప్పుడే ... అదేమిటే... ఇక వరసగా పిల్లల్నికని... బాధలతో..." అన్నది చెల్లెలు.

"సరే నువ్వు లేముందు అలిసిపోయివుంటావు" అంటూ లోపలి గుమ్మం వంకచూసి "ఇదుగో వీడు విస్సిగాడు. ఒరేయ్ నువ్వెందుకురా తలుపుచాటున నక్కి చూస్తున్నావు? ఎవరనుకున్నావు. పిన్నిరా... రా యివతలికి ఇదుగో వీడు ప్రసాదు. అదేమో ఝాన్సీ. రండర్రా యివతలికి. మళ్ళీ రేపు సాయంకాలం వెళ్ళిపోతుందిరా పిన్ని..." అంటూ చెల్లెలివంక తిరిగి "అయినా అదేం చోద్యమే అంత పెద్ద వైరుయిచ్చావు? ఇక్కడ తీరాచేసి ఒక్కరోజు కూడా ఉండవుటే. ఇది అన్యాయమే" అన్నది.

వాణి "ఆఁ! ఎంత కాలం వుంటే నీకు తృప్తి....అదీగాక వెళ్లిపోవాలి.... రేపు బండిలో రిజర్వేషను కూడా వుంది" అంటూ పిల్లలవంక చేతులు చాపి "రండిరా నా దగ్గరికి" అన్నది. వాళ్ళు రాలేదు. ముగ్గురూ కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తూ నిలబడ్డారు.

"పోరేంరా పిన్ని దగ్గరికి" అని అరుంధతి "నువ్వింక లేచిరావే. కాళ్ళు కడుక్కుంటావా స్నానం చేస్తావా?" అని చెల్లెలిని అడిగింది.

వాణి "స్నానమే చేస్తాను. వెధవ రైల్లో వాళ్ళంతా

హూనమైపోయింది" అంటూ సూట్ కేసుతీసి రెండు చీరెలూ, జాకెట్లూ ఇవతల పెట్టుకుని వొళ్ళు విరుచుకుంది.

అరుంధతి 'అయితే నీళ్లుతోడి పిలుస్తానుండు' అంటూ లోపలికి వెళ్లింది.

వాణి సూట్ కేసులోనుంచి మూడు పెద్ద బిస్కట్ల ప్యాకెట్లు తీసింది. అంతవరకూ ఎవరో ఫారెనర్ ని చూసి నట్టు దూరదూరంగా ఉన్న పిల్లలు బిస్కట్ల ప్యాకెట్లు కంటబడేసరికి చింకి చేటలంత మొహాలు చేసుకుని ఆమె దగ్గరగా వెళ్ళారు. వెళ్ళడమే కాకుండా ఆమె మీదపడి వాటిని తలా ఒకటీ లాక్కున్నారు.

అంతలో అరుంధతి లోపలి నుంచి "నీళ్ళు సిద్ధం చేశాను రావే. పెందలాడే భోజనాలు ముగించేస్తే తర్వాత తీరుబడిగా మాట్లాడుకోవచ్చు" అన్నది. అంతలో పిల్లల చేతుల్లో ప్యాకెట్లుచూసి "ఏమిటో తెచ్చినట్టున్నావ్. అయినా యివన్నీ ఎందుకే...ఒరే వెధవల్లారా! అవి యిలా యివ్వండి. దాచిపెట్టి రేపు యిస్తాను. ఇప్పుడు అన్నాలు తిన బోతున్నారుగా...ఇలా...ఇవ్వండి..." అంటూ వాళ్ళ దగ్గ రికి వచ్చింది. వాళ్లు వాటిని గట్టిగా గుండెలకు హత్తుకు నిలబడ్డారు. తల్లికిచ్చే అభిప్రాయం బొత్తిగా లేదని స్పష్టం చేశారు. "రేపు తినవచ్చురా. ఈపూటకు దాచిపెడతాను. నా చేతికివ్వండి. మంచివాళ్లుగా మీరు. ఒరే విస్సిగా, నువ్వ

పెద్దవాడివి కదా, నామాటవిని అది యిలాయివ్వు చక్కగా అలమారులో దాచిపెడతాను" అన్నది.

వాణి నవ్వుతూ చూస్తున్నది. రవీంద్ర మౌనంగా చూస్తున్నాడు. అరుంధతి వాళ్ళ దగ్గర బలవంతంగా వాటిని లాక్కోబోయింది. వాళ్లు అన్ని గదుల్లోకి పరుగెత్తారు. ఆమె కూడా వాళ్ళ వెంట పరుగెత్తి ఎలాగయితేనేం వాళ్లు పెద్దగా ఏడుస్తున్నా వినకుండా వాటిని లాక్కొచ్చింది. ముందు గదిలోకి భర్త మొహంలోకీ, చెల్లెలు మొహంలోకీ చూస్తూ నవ్వుతూ "ఏడిస్తే ఏడిచారు వెధవలు. కాస్సేపు ఏడ్చి వాళ్ళే ఊరుకుంటారు" అన్నది. తర్వాత మళ్ళీ చెల్లెలి వంక తిరిగి "నువ్వులే. నీళ్ళు చల్లారిపోతాయి" అన్నది. ఆ బిస్కట్ ప్యాకెట్లు అల్మారులో వుంచింది. పిల్లలు ముగ్గురూ ఏదో నిధి పోగొట్టుకున్న వాళ్ళ లాగున నెమ్మదిగా యింకా ఏడుస్తూనే వున్నారు. రవీంద్ర వాళ్ళను దగ్గరికి తీసుకుని "తప్పు యేడవకూడదు. అమ్మ రేపు అన్నీ మీకే పెడుతుంది. ఇప్పుడు అన్నం తినొద్దూ మరి" అని ఊరడించాడు.

వాణి చీరె, జాకెట్టు టవలూ తీసుకుని స్నానానికి లోపలికి వెళ్ళింది.

అరుంధతి భర్త దగ్గరికి వచ్చి నెమ్మదిగా "రేపు మళ్ళీ వెళ్ళిపోతుందది" అన్నది.

"అవును అలా అని వైరిచ్చిందిగా?" అన్నాడు రవీంద్ర.

"అది సరేనండీ మీ రర్థం చేసుకోరు. రేపొద్దున ఆఫీసుకు వెళ్ళేలోపల బజారుకు వెళ్ళి మంచి జాకెట్టు గుడ్డ ఒకటి కొనుక్కురండి. అది అన్నప్పుడల్లా రాదు. తెచ్చే దేదో కాస్త మంచిదే తీసుకురండి. పది, పదిహేను రూపా యల్లో..."

"అంత ఖరీదులో ఎందుకు?" అంటూ నసిగాడు రవీంద్ర.

"మీకు తెలియదు. నేను చెప్పినట్టు చెయ్యండి. సరేనా? ఏం డబ్బులేదా?"

"లేకేం. సరిగ్గా పదిహేను రూపాయలే ఉంది"

"అది పెట్టి మంచి గుడ్డ పట్టుకురండి. లేకపోతే నాకి స్తే నేనే బజారుకు వెళ్తును గాని తీరిక ఏదీ? ఏమంటారు?"

"ఏమంటాను? ఫస్టు తారీఖు ఇంకా నాలుగు రోజు లుంది. ఈలోపల రోజూ పాలసీసాలకూ, వాటికీ..."

"ఏమీ ఫరవాలేదు. ఇది మనకు కొత్తా ఏమిటి? రేపీ ఎవరినన్నా అడిగి మరో పదో పదిహేనో అరువు పుచ్చుకోండి."

'సరే' అన్నాడు రవీంద్ర. ఆఫీసులో కల్లా వారికీ, వీరికీ డబ్బు చిన్న మొత్తాలు అప్పు పెట్టగలిగిన వాడు

అచ్యుతం ఒక్కడే. అయితే అతని దగ్గిరికి వెళ్ళి అడగటం ...అతడేవో ప్రశ్నలు వేయడం...ఇదంతా గొప్ప బోరు...

"సరే ఏం చేస్తాం...ఇలాగే నడవనిద్దాం...బండిని" అనుకుని అతడు సన్నగా ఈల వేస్తూ కుర్చీలో వెనక్కు వాలి కూర్చుండిపోయాడు.

* * *

వ్రాత ఆగిపోయింది. వాకిట్లో ఏదో గొడవ. చిరాగ్గా కలం బల్లమీదపడేసి వెళ్ళి చూద్దునుకదా, మా ఆవిడ వరండాలో నిలబడి ఎవరితోనో పోట్లాడుతున్నది. వెళ్లికలుగ జేసుకోవడం నాకు యిష్టం లేదు. సంగతి అర్థం చేసుకుంటూ నిలబడ్డాను.

వాళ్లు పాకీవాళ్ళూ రోడ్లు శుభ్రంచేసే వాళ్ళూను అయిదారుగురు వచ్చారు. సమ్మె చేస్తున్నారుట. జీతాలు నెలల తరబడి లేవని సమ్మెచేస్తున్నారట. పైవాళ్లెవరూ లెక్క చేయడం లేదట. ఊరంతా కంపు కొడుతూ వుంటే ప్రజలుకూడా జీతాలివ్వని పరిపాలకులను కాక వీళ్ళనే తిట్టడం ప్రారంభించారు. సమ్మె చేసేకొద్దీ పొట్టగడవడం కష్టంకదా అందుకని చందాలకు బయలుదేరారు.

మాఆవిడ వాళ్ళని కసిరి కొట్టింది "ఏం, వాళ్లు పొగ రెక్కి సమ్మె చేసినవాళ్లు ఇలా ఇళ్ళవెంట చందాలని ముష్టెత్తుతూ తిరగడం దేనికి? ఆపట్టుకునే కాళ్ళేవో మునిసి

పాలిటి వాళ్ళవే పట్టుకోరాదూ? అసలు దేశంలో అందరూ వాళ్ళు పొగరెక్కి కొట్టుకుంటున్నారే. ఇంతే కావాలి మీకు?" అలా ఏమిటేమిటో అడ్డదిడ్డంగా పెద్దగా అరిచింది.

వాళ్లు మరుక్షణంలో నసుగుతూ బైటికి వెళ్లిపోయారు. నేను కథ ముందు కూర్చున్నాను. ఇప్పుడేం రాయాలి? ఏం రాయాలి?

ఎందుకో నాకే తెలియదు. అప్రయత్నంగా 'రవీంద్ర కుర్చీలో వాలి కూర్చుండిపోయాడు.' అనే వాక్యం తర్వాత 'అంతలో సమ్మె చేస్తున్న మునిసిపాలిటి తోటీ పనివాళ్ళు చందాకోసం ఇంటిముందుకు వచ్చి నిలబడ్డారు; అని మరొక వాక్యం మాత్రం వ్రాసి తర్వాత విసుగుతో కాయితాలు లోపలికి తోసేసి వరండాలోకి వచ్చాను. మనసంతా అరణ్యాం లాగున చీకాగ్గా అసహ్యంగా బరువుగావుంది, అర్థంలేని ఆలోచనలతో వేడెక్కిపోయింది. ఏదో చెయ్యాలనుకొని చెయ్యలేక పోయిన నిస్సహాయత... అసమర్థత...

మరునాడు సాయంకాలం వీధి గుమ్మంలోనుంచి వస్తున్న వెంకట్రావుగారిని చూసి గతుక్కుమన్నాను. లోపలినుంచి ఏదో వొణుకులాంటిది పుట్టుకొచ్చింది. మాఆవిడతో 'ఇంట్లో లేనని చెప్పమని లోపల ఎక్కడైనా దాక్కుండిపోదామా' అనిపించింది.

కాని అంత వ్యవధి యివ్వకుండా ఆయన నేరుగా లోపలికే వచ్చేశాడు. నన్నుచూసి "నాకు తెలుసు. మీరా

పనిమీదే వున్నారని. ఏదీ, తర్వాత ఏం రాశారో విని పించండి." అన్నాడు.

నేను సిగ్గుపడిపోతూ "లేదండీ...ఏమీ రాయలేదు. కథ చెడిపోయింది." అన్నాను.

"ఫరవాలేదు. వినిపించండి ఎందుకు చెడిపోయిందో ఎక్కడ చెడిపోయిందో చూద్దాం" అన్నాడు విడవకుండా.

నేను తెగించి మొండిగా కాయితాలు బైటికితీసి మొత్తం చదివేశాను. ఆ అర్థం పర్థంలేని ఆఖరు వాక్యం కూడా చదివేశాను.

నేను మధ్యలో పొరపాటున కూడా ఆయన వంక చూడలేదు. మొత్తం చదివి కాయితాలను నిర్లక్ష్యంగా లోపలిసొరుగులోకి తోసేసి కూర్చున్నాను. అప్పుడాయన వంక చూశాను.

ఆయన ముందు మతిపోయిన వాడిలా నావంక కళ్లు పెద్దవి చేసుకుని చూశాడు. తర్వాత ఒక్కక్షణం మాత్రం కూర్చుని అంతలో ఏమనుకున్నాడో ఏమో చివాలున లేచి 'వెళ్ళొస్తానండీ' అని మాత్రం అనేసి గబగబ వెళ్లిపోయాడు. నేను చేతివ్రేళ్లు విరుచుకుంటూ ఆవులించాను.

మర్నాటినుంచి నేననుకున్నంతా అయింది.

వెంకట్రావుగారునాతో మాట్లాడటం బొత్తిగా తగ్గించేశాడు.